

జంక్ ఫుడ్‌తో అనారోగ్య సమస్యలు : జెవివి

ప్రజాశక్తి-నెల్లూరు

మొబైల్ ఫోన్ వినియోగం, జంక్ ఫుడ్ వల్ల పిల్లలలో వచ్చే అనారోగ్య సమస్యల గురించి డాక్టర్ కాలేషా సాహెబ్ డాక్టర్ మహమ్మద్ రఫీ పిలలకు వివరించారు. మంగళవారం నెల్లూరు జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని వేదాయ పాళెంలో శ్రీ సాయి మహా విద్యాలయ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ కాలేషా మాట్లాడుతూ మొబైల్ ఫోన్ అధికంగా వాడితే, పిల్లలలో కొన్ని దుష్ప్రంభావాలు వస్తాయన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

ఇథనాల్ ప్రాజెక్టు వద్దన్నందుకు ..

పోలీసుల నిర్బంధం..!

-మూలం రమేష్ హౌస్ అరెస్ట్
- సిపిఎం నేతల అరెస్ట్.. స్టేషన్‌కు తరలింపు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కిసాన్ సెజ్ లో ఇథనాల్ పరిశ్రమల వల్ల ప్రమాదకర కాలుష్యం వస్తుందని,పరిశ్రమలు పెట్టవద్దంటూ సిపిఎం నేతల ఆందోళన నేపథ్యంలో నెల్లూరు జిల్లాలో పోలీసులు నేతలను, కార్యకర్తలను నిర్బంధం చేశారు. నెల్లూరు జిల్లాలోని కొడవలూరు మండలం, రేగడచెలిక గ్రామం వద్ద 2,770 ఎకరాల్లో ఉన్న కిసాన్‌సెజ్‌లో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రెండు ఇథనాల పరిశ్రమకు అనుమతిచ్చింది. అందుకోసం మంగళవారం సెజ్ ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రజలను చైతన్యం చేస్తున్న సిపిఎం నేతలకు సోమవారం నోటీసులు జారీ చేశారు. సోమవారం రాత్రి సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్‌ను అరెస్ట్ చేసి, సొంత పూచీకత్తుపై విడుదల చేసిన పోలీసులు రాత్రి 10 గంటల నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు గృహనిర్బంధం చేశారు. వెంకటేశ్వరపురం సెంటర్‌లోని ఆయన నివాసం వద్ద నుంచి బయటకు రానివ్వకుండా అడ్డుకున్నారు. నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులను వెంకటేశ్వరుపురం విజయ పాలడెయిరీ వద్ద ఉన్న ఇంటినుంచి బయటకు రానివ్వలేదు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లను కొద్దిసేపు హౌస్ అరెస్ట్ చేసి, అనంతరం ఐదో నగర పోలీసు స్టేషన్‌కు తరలించారు. జిల్లా వ్యాపితంగా సిపిఎం నేతలు, కార్యకర్తలపై పోలీసులు నిర్బరంధం కొనసాగింది.

పోలీసుల నిర్బంధాలు ఛేదించుకొని మంగళవారం ఉదయం కొడవలూరు మండలం, రాజుపాళెం వద్దకు సిపిఎం నేతలు, కార్యకర్తలు చేరుకున్నారు. అక్కడ నుంచి ప్రదర్శనగా కిసాన్‌సెజ్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నం చేశారు.అప్పటికే అక్కడ ఉన్న పోలీసులు నాయకులను అరెస్ట్ చేసి, వ్యానులో కోవూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. మోహన్‌రావు, మూలి వెంగయ్య, తుళ్లూరు గోపాల్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు సిఎస్ సాగర్, సిపిఐ ఎంఎల్ నాయకులు లక్ష్మీరెడ్డి, రమణయ్య, ఎస్‌యుసిఐ నాయకులు బసవరాజు, బిఎస్‌పి నాయకులు ఎంబేటి శ్రీనివాసులు, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు బిపి నరసింహ, పిడిఎస్‌యు నాయకుల సునీల్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు, గండవరపు శేషయ్య, గోను దయాకర్, పౌరహక్కుల సంఘం నాయకులు శివకుమార్, చేతివృత్తిదారుల సంఘం నాయకులు గుంజి దయాకర్, కొడవలూరు మండల కార్యదర్శి మహబూబ్ బాషా, తదితరులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు. అరెస్ట్ చేసిన నాయకులను మధ్యాహ్నం విడుదల చేశారు. పోలీసుల తీరును సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తీవ్రంగా ఖండించారు.

మూలం రమేష్‌ను గృహ నిర్బంధం చేసిన దృశ్యం

రాజుపాళెం వద్ద సిపిఎం నాయకులు, వామపక్ష నాయకులను అరెస్టు చేస్తున్న దృశ్యం

కోవూరు పోలీస్‌స్టేషన్ సిపిఎం నాయకులు..

'కాలుష్య పరిశ్రమలు మా కొద్దు'..!

-మా పిల్లలకు ఉద్యోగాలివ్వండి..
-చిమ్మేవి...మరుగుదొడ్లు కడిగేవి కాదు
-ఇథనాల్ ప్రజాభిప్రాయం సేకరణలో ప్రజలు
-మాట నిలబెట్టుకోండి : కలెక్టర్

"మాకు పరిశ్రమలు కావాలి...కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు మాత్రం మాకు వద్దు....మా పిల్లలకు ఉద్యోగాలు, ఉపాధి చూపించండి... అలాగని చిమ్మేవి, మరుగుదొడ్లు కడిగేవి ఇస్తామంటే ఒప్పుకోం..మా పంటలకు గిట్టుబాటు ధర కల్పించండి" అంటూ ప్రజలు నిలదీశారు...మంగళవారం రేగడచెలిక కిసాన్‌సెజ్‌లో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సిపిఎం, ఇతర వామపక్ష పార్టీల నేతలు దీనిని వ్యతిరేకించారు. రాజుపాళెం సెంటర్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సిపిఎం నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. ఇఫ్కో కిసాన్ సెజ్ బయట కొందరు మహిళలు నిరసన తెలిపారు.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కొడవలూరు మండలం, రేగడచెలిక వద్ద ఇఫ్కో కిసాన్ సెజ్‌లో నూతనంగా నిర్మించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమలు, కిసాన్‌సెజ్‌కు మూడు ప్రజాభిప్రాయ సేకరణలు కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షత జరిగింది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ ఎన్. అశోక్‌కుమార్ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కిసాన్‌సెజ్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను సిఇఒ సుధాకర్‌రావు వివరించారు. మెస్సర్స్ రామ్కీ బయో ప్రయివేట్ లిమిటెడ్, (370 కిలో లీటర్లు) మెస్సర్స్ గాయత్రి రెన్యూవబుల్ ఫ్యూయల్స్ అండ్ అలైడ్ ఇండస్ట్రీస్ ప్రయివేటు లిమిటెడ్ (200 కిలో లీటర్లు) ఇథనాల్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. తొలుత రేగడచెలిక సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం రైతుల నుంచి తక్కువ ధరలకు భూములు తీసుకున్నారని, అప్పుడు ఎరువుల పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పి, ఇప్పటి వరకు ఏం చేయలేదని, పరిశ్రమలు రావడానికి తాము వ్యతిరేకం కాదని, అయితే కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు మాకొద్దు అన్నారు. తాము ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా జరుగుతుందన్నారు. తమకు అనేక అనుమనాలున్నాయని గతంలో క్రెబ్స్ పరిశ్రమ ఏర్పాటు సమయంలోనూ ఇలానే చెప్పారని, తరువాత దుర్వాసన, నీటి కాలుష్యం, పశువులు చనిపోవడం వంటిసమస్యలు వచ్చాయన్నారు. పర్యవరణానికి ఇబ్బంది లేకుండా ఏం చేస్తారో చెప్పాలన్నారు. 30 సంవత్సరాల నుంచి బర్రెలు మేపుకోడానికి అవకాశం లేకుండా ఉన్నాయన్నారు. స్థానికులు అనేక మంది భూములు ఇచ్చారని, గమేశా పరిశ్రమ వచ్చిన సమయంలో తమకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు కేవలం చిన్న చిన్న ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారన్నారు.

రాచర్లపాడు అప్పలరెడ్డి మాట్లాడుతూ భూములిచ్చి అన్ని కోల్పోయామని, స్థానికులకు జీవనోపాధి కల్పించాలని కోరారు. తాగు, సాగునీరు దెబ్బతిన కుండా చూడాలని, పరిశ్రమలకు నీరు ఇచ్చి రైతులకు అన్యాయం చేస్తారనే భయం ఉందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఇథనాల్ పరిశ్రమలకు స్థానికుల ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ తాము నిర్వహించనున్న ఇథనాల్ పరిశ్రమలో నూతన పద్ధతుల్లో ఉత్పత్తి జరుగుతుందని, ఎక్కడా కాలుష్యం ఉండదని తెలిపారు. స్థాని కులకు ఉద్యోగాలు ఇవ్వడానికి అవకాశం ఇస్తామన్నారు. కాంట్రాక్టు పనులు స్థానికులకే ఇస్తామని తెలిపారు. మాట్లాడిన ప్రతి వ్యక్తి పొల్యూషన్ లేని ప్రాజెక్టు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.

హామీలు అమలు చేయాలి : కలెక్టర్

పరిశ్రమలు పెట్టే సమయంలో అనేక హామీలు ఇస్తారని, పరిశ్రమలు పెట్టిన తరువాత మర్చిపోతారని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్కటీ అమలు చేయాల్సిందేనన్నారు. ప్రజలకు తాగు, సాగునీరు ఇచ్చిన తరువాతే పరిశ్రమలకు నీరు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇథనాల్ ప్లాంట్‌లో రైతులు పండించిన వరి ధాన్యం అవసరం ఉంటుందని, దీనిని స్థానికుల వద్దే కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కాలుష్యం లేకుండా ప్రజలకు ఏం చేస్తారో చెప్పాలని కంపెనీ ప్రతినిధులను ప్రశ్నించారు. 30 సంవత్సరాల క్రితం ఇక్కడ ప్రజలు భూములు ఇచ్చారని, ఉద్యోగాలు కల్పన విషయంలో తొలి ప్రాధాన్యత వారికే ఇవ్వాలని, నైపుణ్య శిక్షణ ఇచ్చి పరిశ్రమలలో అవకాశం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

పోలీసుల వలయంలో ప్రజాభిప్రాయ సేకరణ

ఇథనాల్ పరిశ్రమల కోసం జరిగిన పబ్లిక్ హియిరింగ్ పోలీసు వలయంలో సాగింది. జిల్లాలోని అందరూ డిఎస్‌పి, సిఐలు, ఇక్కడే కనిపించారు. స్థానికులకు ప్రజాభిప్రాయానికి రావాలని నోటీసులిచ్చి తీరా అక్కడకు రానివ్వకుండా అడ్డుకు న్నారు. ఎవరు, ఎక్కడివారు, అంతా విచారించుకొని లోనికి అనుమతించారు. బయట వ్యక్తులను ఎవరినీ అను మతించలేదు. స్థానిక గ్రామాలు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వ్యక్తులను మాత్రమే మాట్లా డడానికి అవకాశం కల్పించారు. అదనపు ఎస్‌పి సౌజన్య, దగ్గరుండి బందోబస్తు చేసింది. కావలి ఆర్‌డిఒ ఎం.వంశీకృష్ణ, ఇతర అదికారులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

మాట్లాడుతున్న రైతు అప్పలరెడ్డి

ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన గ్రామస్తులు

విద్యార్థులకు నాణ్యమైన విద్య

నెల్లూరు కార్పొరేషన్ :నగరంలోని విఆర్ హైస్కూల్‌ను మంత్రి పొంగూరు నారాయణ సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న విద్యపై మంత్రి నారా యణ ఆరా తీశారు.. మెరుగైన విద్యావిధానంపై ఉపాధ్యాయులకు పలు సూచనలు నగరం లోని ప్రభుత్వ హైస్కూల్స్ అభివృద్ధిపై విద్యాశాఖాధికారులతో ఆయన సమీక్షించారు. ఇన్‌ఛార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమిషనర్ నందన్, డిఇఒ బాలాజీ రావు, ప్రిన్సిపాల్, స్థానిక టిడిపి నేతలు పాల్గొన్నారు.

రీ సర్వేపై రైతులకు సూచనలు

ప్రజాశక్తి-లింగసముద్రం:మండలంలోనివెంగళాపురం,ముక్తేశ్వరం గ్రామాలకు సంబంధించిన 4వ విడత గ్రామ సభ మంగళవారం ఆయా గ్రామాల్లో నిర్వహించారు. గ్రామాల్లో సర్వే జరిగే సమయంలో అందరు అందుబాటులో ఉండి భూములు సక్ర మంగా గట్లు కొలిపించుకోవాలని,సర్వే సమయం అందుబాటులో ఉండాలని రైతులకు, గ్రామ స్తులకు సూచించారు. మండల సర్వేయర్ ఎం.రమేష్ బాబు, ఆర్ఐ ఎం. రమణయ్య, గ్రామ సర్వేయర్స్ శివ, సాయి, విఆర్ఒలు మౌనిక, నాగరాజు,నాయకులు పి.బ్రాహ్మయ్య, శ్రీను, నారాయణ పాల్గొన్నారు.

రైతులకు సూచనలు

ప్రజాశక్తి -లింగసముద్రం :మండలంలోని యర్రరెడ్డిపాలెం,లింగసముద్రం గ్రామాలను పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఇన్‌ఛార్జి మండల వ్యవసాయ అధికారి సిహెచ్ వివిఎల్ దుర్గ మంగళవారం నిర్వహించారు. రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు తమ పంటను సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులచే ఈ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.వ్యవసాయ సహాయకులు దీప,రేణుక పాల్గొన్నారు.

వీధి దీపాల వెలుగులు

ప్రజాశక్తి -గుడ్లూరు : గుడ్లూరులో స్థానిక గిరిజన ఎస్‌సి కాలనీలలో సర్పంచ్ శంకర్ ఆధ్వర్యంలో వీధి దీపాలు మంగళవారం వెలిగించారు. గుడ్లూరు కాలనీలలో కాలిపోయిన వీధి దీపాల స్థానంలో నూతన విద్యుత్ బల్బులు వెలిగించి ప్రజలకి ఎటువంటి ఇబ్బం దులు లేకుండా చూడాలనే లక్ష్యంతో ఎంపిడిఒ వై వెంకటేశ్వరరావు సహకారంతో విద్యుత్ హెల్పర్లని ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో వీధి దీపాలు వెలిగిస్తున్నట్లు సర్పంచ్ శంకర్ తెలిపారు.

ఇరిగేషన్ శాఖలో అవినీతి : కాకాణి

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్ :నెల్లూరు ఇరిగేషన్ శాఖలో కూటమి ప్రభుత్వంలో ఎన్నడూ లేనటువంటి విధంగా కనివిని ఎరుగని రీతిలో అవినీతి తిమింగలాలు ఉన్నాయని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడి విమర్శించారు. మంగళవారం స్థానిక డైకాస్ రోడ్డులోని వైసిపి జిల్లా కార్యాల యంలో ఆయన మాట్లాడారు. పలువురు వైసిపి నాయకులు ఉన్నారు.

చిత్ర పటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి -సైదాపురం :మండలంలోని సొసైటీ కార్యాలయంలో మంగళవారం సైదాపురం మండలాన్ని నెల్లూరు జిల్లాలో కొనసాగించినందుకు సిఎం చంద్రబాబు నాయుడు, వెంకటగిరి ఎంఎల్‌ఎ కురుగొండ్ల రామకృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి కతజ్ఞతలు తెలిపిన టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

టిడిపి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు :పట్టణంలోని 31,32 వార్డు టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ముద్రించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వర రావు టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కష్ణారెడ్డి, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ ఇంటూరి

రాజకీయ కిత కితలు..!

రాజకీయాల్లో కితకితలు కనిపించాయి. ఈ ఏడాది అధికార టిడిపి నేతల మధ్య సయోధ్య కరువైంది.. ఎక్కువ నియోకవర్గాల్లో కార్యకర్తలు, నాయకుల మధ్య విభేదాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. వైసిపి ఈ ఏడాది కాస్త స్పీడ్ పెంచింది. పిపిపి పద్ధతిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు విషయంలో ఆపార్టీ జనంలోకి వెళ్లింది. ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత ఆపార్టీ అన్ని నియోజకవర్గాల్లో నిలతొక్కుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. కోవూరు మాజీ ఎంఎల్‌ఎ ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపైదాడి, మేయర్ స్రవంతికి పదవి గండం, బీద రవిచంద్రకు ఎంఎల్‌సి, పార్టీ అధ్యక్ష పదవి. జిల్లాల పునర్విభజనలో ఆరు మండ లాలు నెల్లూరు జల్లాలో కలవడం అంతా ఈ ఏడాది జరిగిన రాజకీయ పరి ణామాలు జరిగాయి. రాజకీయాలు పక్కనపెట్టి సిపిఎం అనేక ప్రజా పోరాటాలు నిర్వహించింది.

- టిడిపిలో విభేదాల గోల
- స్పీడ్ పెంచిన వైసిపి
- మేయర్ స్రవంతికి పదవి గండం
- 2025 పొలిటికల్ రివ్యూ

రివ్యూ

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

రాజకీయాల్లో ఎంతో చైతన్యవంతమైన నెల్లూరు జిల్లాలో అనేక రాజకీయ పరిణామాలు ఈ ఏడాది చోటు చేసుకున్నాయి. గతేడాది పదికి పది నియోజకవర్గాల్లో అధికారం టిడిపికి అవకాశం ఇచ్చారు. గెలిచినప్పటి నుంచి టిడిపి నేతల మధ్య సయోధ్య కుదరడం లేదు. కావలి నియోజ వర్గంలో బీద సొదరులు, ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి, మాలేపాటి సుబ్బానాయుడు మధ్య నెలకొన్న రాజకీయ పరిణామాల్లో మాలేపాటి సుబ్బానాయుడు అనారోగ్యంతో మృతి ,చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటన జిల్లాతోపాటు, రాష్ట్రంలో చర్చనీయాంశమైంది. నెల్లూరు నగరం, కందుకూరు, ఉదయగిరి, నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ ఇబ్బందులు ఎదుర్కొంటుంది. కోవూరు మాజీ ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అనుచరులు ఇంటిపై దాడిచేసి ధ్వంసం చేశారు. ఇది జిల్లా రాజకీయాల్లో ఎన్నడూ చూడని పరిణామాలు, ఈ విషయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరులో పర్యటించారు. అటు తరువాత వైసిపి, టిడిపి నేతల మధ్య జరిగిన రాజకీయాల్లో విభేదాల్లో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ ఏడాది 88 రోజులు జైలు జీవితం అనుభవించారు. మాజీ అనిల్‌కుమార్‌యాదవ్ పోలీసుల విచారణ ఎదుర్కొన్నారు. ఇక ఓవైపు టిడిపి నేతల మధ్య విభేదాలు కొనసాగుతుండగా, మరో వైపు ప్రతిపక్ష వైసిపి కాస్త స్పీడ్ పెంచింది. పిపిపి పద్ధతిలో మెడికల్ కాలేజీల ఏర్పాటు విషయంలో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఉద్యమం చేపట్టారు. కోటి సంతకాలు సేకరించారు. వైసిపిలోనూ నేతల మధ్య సయోధ్య కుదర లేదు. నియోజకవర్గాల్లో ఓడిపోయిన తరువాత నెల్లూరు సిటి, సర్వేపల్లి నియోజకవర్గాల్లో మాత్రమే ఆపార్టీ కాస్త కనిపిస్తోంది. మిగిలిన చోట్ల ఉన్నామంటే ఉన్నాం అనే స్థాయిలోనే ఉంది. నెల్లూరు నగర మేయర్ గిరిజన మహిళ స్రవంతికి పదవి గండం కలిగింది. నాలుగు సంవత్సరాలు నిండిపోవడంతో టిడిపి ఆమెపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. అనేక రాజకీయ పరిణామాల నేపథ్యంలో స్రవంతి తన పదవికి రాజీనామా చేసింది. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ ప్రస్తుతం ఇన్‌ఛార్జ్ మేయర్‌గా కొనసాగుతున్నారు.

కరేడులో రైతుల ఉద్యమం (ఫైల్)

వైసిపి నేత ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి జరిగిన దృశ్యం (ఫైల్)

మాజీ మేయర్ పి. స్రవంతి (ఫైల్)

పోరాట బాటలో సిపిఎం..!

ఈ ఏడాది సిపిఎం పోరాటాలు ఉధృతంగా నిర్వహించింది. కరేడు ప్రాంతంలో రైతుల నుంచి సుమారు 8450 ఎకరాలను సేకరించడానికి చేసిన ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావుతోపాటు, 10 వామపక్ష పార్టీలు ఆ ఉద్యమంలో పాల్గొన్నాయి. ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకించాయి. పోలీసుల నిర్బంధాలను వ్యతిరేకించి రాష్ట్ర వ్యాపిత ఉద్యమంగా దీనిని తీర్చిదిద్దారు. గంజాయి గుండాలు కె. పెంచలయ్యను అత్యంత కిరాతంగా హత్య చేసిన సమయంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఈ హత్యను వ్యతిరేకించారు. రాష్ట్ర వ్యాపితంగా గంజాయిపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో ఇథనాల్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. పోలీసులు అరెస్టులు, నిర్బంధం కొనసాగించారు. ప్రజలు, ప్రజా పోరాటాలతో ఈ ఏడాది సిపిఎం పోరు బాటలో నడిచింది.

జిల్లా విభజనలో రాజకీయ దుమారం..!

వైసిపి ప్రభుత్వం గతంలో జిల్లాను ముక్కలు చేసింది. టిడిపి ప్రభుత్వం ఇదే కొనసాగించింది. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేశారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని చెప్పి మాట తప్పారు. దుగరాజుపట్నం తిరుపతి జిల్లాలో కలపాలనే ఉద్దేశంతో వాకాడు, చిట్టమూరు మండలాలను తిరుపతి జిల్లాలోనే కొసాగిస్తున్నారు. గూడూరు నియోజకవర్గంలోని కోట, చిల్లకూరు, గూడూరు మండలాలతోపాటు, కలు వాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరులోనే ఉంచేలా చేశారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లా స్వరూపం 4 డివిజన్లతో, 36 మండలాలతో కొనసాగుతోంది.

తహశీల్దార్ బదిలీ

ప్రజాశక్తి - లింగసముద్రం : మండల తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఎం కోటేశ్వరరావు కావలికి బదిలి అయ్యారు. కందుకూరు నియోజకవర్గం ప్రకాశం జిల్లాలో కల వడంతో ఈ బదిలీ జరిగి నట్లు కార్యాలయం అధికారులు తెలిపారు. లింగసముద్రం తహశీల్దార్ కార్యాలయంలో డిటిగా పనిచేస్తున్న ఎం .హనుమ యమ్మను ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తరువలు జారీ చేశారు.

కలపకు వేలం

ప్రజాశక్తి -వలేటివారిపాలెం : మండలంలోని నలదళపూరు సాగునీటి చెరువులో ఉన్న చిల్ల కర్రను ఊటుకూరి కోటేశ్వరరావు అనే వ్యక్తి రూ. 4 లక్షల 10 వేలకు పాట పాడుకున్నారు నందల పూర్ లో మంగళవారం పంచాయతీరాజ్ అధి కారులు సాగునీటి చెరువులోని చిల్లకర్ర విక్రయానికి బహిరంగ వేలం నిర్వహించారు. ఆ పాటలో కోటేశ్వరరావు పై మొత్తానికి పాడుకున్నారు. ఎంపిడిఒ శంకర్రావు డిప్యూటీ ఎంపిడిఒ వెంకట నారాయణ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు నాయకులు కృష్ణ ఉన్నారు.

వైకుంఠపురంలో మంత్రి పర్యటన

ప్రజాశక్తి -నెల్లూరు కార్పొరేషన్

నెల్లూరు నగరం ఐదో డివిజన్ వైకుంఠపురంలో మంత్రి నారాయణ పర్యటించారు. ఆ ప్రాంత వాసులు ముంపు సమస్యను తన దృష్టికి తీసు కొచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం అధికారులతో కలిసి వైకుంఠపురంలో ఏరియాలో పర్యటిం నట్లు మంత్రి తెలిపారు. ఇంటింటికి వెళ్లి గిరిజనుల సమస్యలను తెలు సుకుని వారి సమస్యల పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట కమిషనర్ నందన్ ,ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్ ,మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ అనురాధ ,మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి ,నగరపార్టీ అధ్యక్షుడు మామిడాల మధు డివిజన్ ప్రెసిడెంట్ గంగాధర్ ,కోదండ రామాలయ చైర్మెన్ సిరి శ్రీనివాస్ ఉన్నారు.

గంజాయి మాఫియాకు టిడిపి అండ : పర్వతరెడ్డి

ప్రజాశక్తి- నెల్లూరు అర్బన్ : నెల్లూరు నగరంలో రౌడీలకు, గంజాయి గడ్డగా మారిందని వారికి టిడిపి నాయకులు అండదండలు పుష్కలంగా ఉన్నాయని ఎంఎల్‌సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి విమర్శించారు. మంగళవారం డైకాస్ రోడ్డు లోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది నెల్లూరులో జరిగిన అన్ని నేరాలు రాష్ట్రంలో ఎక్కడా జరగ లేదన్న విషయం నేడు ఆంధ్రజ్యోతి పేపర్ లో వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నెల్లూరులో జరుగుతున్న దుర్మార్గాల గురించి సీఎం ప్రజలు మంత్రులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే మంత్రి నారాయణ మరోరకంగా మాట్లాడు తున్నారన్నారు.

డివైడర్ పనులు పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు :పట్టణంలో రూ. 5.43 కోట్లతో జరుగుతున్న డివైడర్, సెంట్రల్ లైటింగ్, ఇతర అభివద్ధి పనులను ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. టిడిపి నాయకులు, మున్సిపల్ అధి కారులతో కలిసి పామూరు రోడ్డు జంక్షన్ వద్ద పనులను పరిశీలించారు..ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పామూరు రోడ్డు జంక్షన్ వరకు పనులు పూర్తికాగా, డిసెంబర్ 31వ తేదీ సాయంత్రం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చెయ్యాలని సూచించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి దివి కొండయ్య చౌదరి విగ్రహం వరకు పనులను సంక్రాంతిలోపు పూర్తి చేయాలని ఎంఎల్‌ఎ నాగేశ్వరరావు సూచించారు మున్సిపల్ డి ఈ గణపతి, ఏఈ బాలాజీ, పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి ఉన్నారు.

ప్రశంసా పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి- కందుకూరు : కార్యకర్తల కష్టంతోనే తాను ఎంఎల్‌ఎ స్థాయికి ఎదిగానని, ఆ విషయాన్ని తాను ఎప్పటికీ మరిచిపోనని ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా పార్టీకి సేవలందించిన నియోజకవర్గంలోని 80 మంది ఉత్తమ కార్యకర్తలకు మంగళవారం ఆయన ప్రశంస పత్రాలను ఎంఎల్‌ఎ స్వయంగా అందజేశారు. తాను ఇన్‌ఛార్జిగా వచ్చిన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నానని, తనను అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రయత్నాలు జరిగా యన్నారు. ఆ సందర్భంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తనకు అండగా నిలిచారని తెలిపారు. కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపి ప్రక్రియ పూర్తయిందని ఎంఎల్‌ఎ నాగేశ్వరరావు వెల్లడించారు. ప్రజల ఇబ్బందులను గమనించి సహకరించిన సిఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కందుకూరు పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కష్ణారెడ్డి, లింగసముద్రం మండల టిడిపి అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, గుడ్లూరు మండల టిడిపి పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్ ఉన్నారు.

ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంఎల్‌ఎ 'ఇంటూరి'

మంత్రి ఆనంను కలిసిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని మంగళవారం కౌన్సిలర్లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. సత్కరించిన వారిలో ఆత్మకూరు మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు సురా భాస్కర్ రెడ్డి, పొదమేకల పెంచలయ్య, మహబూబ్ భాషా, తదితరులున్నారు.

వరిలో నీటి యాజమాన్యంపై అవగాహన

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని సోమశిల, పడమటి కంభంపాడు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి శైలజా కుమారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరిలో నీటి యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. వరినాటిన నాటినప్పుడు బురద పదునులో నాటాలన్నారు. కార్యక్రమంలో సోమశిల సర్పంచ్, పడమటి కంభంపాడు ఎంపిటిసి, వెయ్యల శ్రీనివాసులు, ఏఏఓలు జ్యోత్స్న, సాదియా, రైతులు పాల్గొన్నారు.

బిఎల్ఒలకు శిక్షణ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారిని పావని ఆదేశాల మేరకు, తహశీల్దారు కె.అనిల్ కుమార్ అధ్యక్షతన స్పెషల్ ఎంటెన్సివ్ రివిజన్ పై మండలంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులకు, బిఎల్ఒలకు, బిఎల్ఎలకు అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దారు మాట్లాడుతూ ఓటర్ లిస్టులో ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, ఇప్పుడే బూత్‌లలో పూర్తి వివరాలను నమోదు చేయాలని తెలియజేశారు. [illegible] ఓటర్ లిస్టులను తనిఖీ పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ టి.రాజేంద్ర, విఆర్ఒలు, బిఎల్ఒ, బిఎల్ఎలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మండలం నువ్వురుపాడు పంచాయతీ పాత జంగాలపల్లి గ్రామంలో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు వన్ విలేజ్ ఫోర్ విజిట్ గ్రామ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తహశీల్దార్ పద్మజ కుమారి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మజాకుమారి మాట్లాడుతూ గ్రామంలో రైతుల పొలాలకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న తెలియపరిస్తే వెంటనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులకు ఉపయోగపడే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారని ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టిడిపి యువజన నాయకులు పోలవరపు రెడ్డి సుధీర్ రెడ్డి, షేక్.భాజావలీ, షేక్.మస్తాన్‌వలీ, గ్రామ ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేత విజయకు సన్మానం

ప్రజాశక్తి-బిట్రగుంట : నెల్లూరు పార్లమెంట్ సెక్రటరీగా కందుకూరి విజయమ్మను ఎంపిక చేయడంతో బోగోలు పంచాయతీ హరిజనవాడ లోని శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయంలో గ్రామస్థులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా తుగురు మల్లికార్జున, బుర్రి అనురాధ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో దళిత మహిళలకు ఇస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి దళిత మహిళ కందుకూరి విజయ ఎంపిక చేయడంపై ఆయనకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బలివాల్ల శ్రీకర్, బుర్రి వెంకట్రావు, దుగ్గిరాల వీరప్పన్న, బుర్రి చంటి, శ్రీనివాసులు శ్రీనివాసులు, శ్రీదేవి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని గుంపర్లపాడు గ్రామపంచాయతీలో డిప్యూటీ తహశీల్దారు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జనవరి 2వ నిర్వహించనున్న రీ సర్వేపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలతో సమావేశాన్ని నిర్వహించారు. భూములకు సంబంధించిన రెవెన్యూ సంబంధమైన సమస్యలను సత్వర పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు, సంబంధించిన రెవెన్యూ సమస్యలను గ్రామసభలో తెలియజేయాలన్నారు. సమావేశంలో గ్రామరైతులు, విఆర్ఒలు, నాయకులు మస్తాన్‌వలీ, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ 2026 నూతన క్యాలెండర్‌ను వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్‌పిటిసి డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య యాదవ ఎంప్లాయిస్‌తో కలిసి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదిశేషయ్య మాట్లాడుతూ రాబోయే 2026 నూతన సంవత్సరంలో ప్రతిఒక్కరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలన్నారు. కార్యక్రమంలో గంగుల మధుసూదన్, గుర్రం నాగేశ్వరరావు, కౌన్సిలర్ పొదమేకల పెంచలయ్య, ఒంటేరు మల్లికార్జున, దేగ ప్రసాద్, బత్తల శ్రీనివాసులు, నల్లబోయిన వెంకటేశ్వర్లు, నన్ను రామకృష్ణ, కొల్లబోయిన మల్లికార్జున, కటారి సుధాకర్, గాలిబోయిన అయ్యన్న, గుండుబోయిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలవ్యాప్తంగా మంగళవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉత్తర ద్వార దర్శనం కోసం తెల్లవారు జామునుండే దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ప్రజాశక్తి-వింజమూరు : వింజమూరు మండల పరిధిలోని అన్ని ఆలయాలలో వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. దర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండి భక్తులు ఆలయాలకు వచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. మండలంలోని నల్లగొండ గ్రామ మద్దిశ్వర లక్ష్మీనరసింహస్వామి వింజమూరులోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శివాలయం శ్రీ రామాలయం శ్రీ శిరిడి సాయిబాబా ఆలయాలలో స్వామివారిని ద్వార దర్శనం ద్వారా ప్రత్యేకంగా దర్శించుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక భజన కార్యక్రమాలను నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వింజమూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

వీధి కుక్కల స్వైరవిహారం

ప్రజాశక్తి-అల్లూరు : అల్లూరు మండల పరిధిలో వీధి కుక్కల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో గుంపులుగా తిరుగుతూ వాహనదారులు, పాదచారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఇటీవల పలుచోట్ల కుక్కల దాడుల్లో గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పాఠశాల పరిసరాల్లో, బస్టాండ్ ప్రాంతాల్లో కుక్కల స్వైరవిహారం మరింత పెరగడంతో ప్రమాదాలు జరుగుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. నగర పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి కుక్కల నియంత్రణ, టీకాల కార్యక్రమం చేపట్టాలని, శాస్త్రీయ పద్ధతిలో స్టెరిలైజేషన్ లాంటి చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి గోపసాని రమేష్ తెలిపారు. సమస్యపై అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

- నిర్బంధాల మధ్య ప్రజాభిప్రాయసేకరణ దారుణం
- 40మందిని అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గం

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజల ఆరోగ్యానికి భంగం కలిగించే ఇథనాల్ పరిశ్రమల స్థాపన చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకొని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేశారు. రాచర్లపాడు ప్రాంతంలోని ఇఫ్కో కిసాన్‌సెజ్‌లో సోమవారం ఇథనాల్ పరిశ్రమ స్థాపించేందుకు ప్రభుత్వం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ప్రజలను హాజరు కానివ్వకుండా గ్రామాల్లోని టిడిపి నాయకులను, అధికార పార్టీకి చెందిన కార్యకర్తలను రంగంలోకి దింపి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని పూర్తి చేయడాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీలు డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ ఇథనాల్ పరిశ్రమ స్థాపనకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ప్రజలు, రైతులు హాజరు కానివ్వకుండా అవరోధాలు సృష్టించి ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా పోలీసు యంత్రాంగం, అధికార యంత్రాంగం సహాయంతో ఈ తంతు ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. 'ప్రజలకు మాత్రం జబ్బులు.. ప్రజాప్రతినిధులకు కాసులు' అన్న విధంగా ప్రభుత్వ పాలన కొనసాగిస్తుందన్నారు. ఒక పక్క తెలంగాణాలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తే ఆ కార్యక్రమానికి ప్రజలందరూ హాజరై తమ వాదనను వినిపించారన్నారు. ఈ పరిశ్రమల వల్ల ప్రజలకు తీవ్రమైన జబ్బుల బారిన పడతారని చెప్పడంతో ప్రభుత్వం వెనక్కి వెళ్లిపోయిందన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమ స్థాపించేది లేదని ప్రకటించారన్నారు. ఎపిలో మాత్రం ప్రజాభిప్రాయానికి విభిన్నంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రజా సంఘాల ప్రతినిధులను, రాజకీయ పార్టీలను, మేధావులను ఆ కార్యక్రమానికి హాజరు కానివ్వకుండా ఎక్కడికక్కడే పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. జిల్లాలో

మాట్లాడుతున్న నాయకులు

40మంది వామపక్ష పార్టీలకు చెందిన కార్యకర్తలను గృహనిర్బంధం చేయడం, మరి కొంతమందిని పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తరలించడం వంటి చర్యలకు పాల్పడ్డారన్నారు. ఈ పరిశ్రమలు స్థాపించి ఉత్పత్తులు ప్రారంభించేందుకు కలిగిరి చెరువు నీటినంతటిని వినియోగిస్తే తమ పరిస్థితి ఏమిటని, పంటలు ఏ విధంగా సాగుబడి చేసుకోవాలని రైతులు, భూగర్భ జలాలు అంతరించిపోవడం వల్ల తమకు తాగు నీరు ఇబ్బందులు ఎదురవుతాయని ప్రజలు వాపోతున్నారన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రజలందరి అభిప్రాయం తీసుకొనేందుకు ప్రభుత్వం మరోమారు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పొల్యూషన్ బోర్డు నుంచి అనుమతులు లేకుండా ఈ పరిశ్రమ స్థాపించడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రశ్నించేవారందరినీ జైళ్లకు పంపించడం, అరెస్టు చేయడం వంటి చర్యలకు పాల్పడుతుందన్నారు. ఇటువంటి పరిశ్రమలను స్థాపించకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు సిహెచ్ సాగర్ మాట్లాడుతూ పర్యావరణానికి తీవ్రమైన హాని కలిగించే ఇథనాల్ పరిశ్రమ ఇఫ్కో కిసాన్‌సెజ్‌లో స్థాపించాలన్న ఉద్దేశంతో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో నిర్బంధాన్ని ప్రయోగించి ప్రభుత్వం పూర్తి చేయడం దుర్మార్గమన్నారు. వామపక్షపార్టీల నాయకుల, ప్రజాసంఘాల నాయకులు, పర్యావరణ ప్రేమికుల నోళ్లకు తాళాలేసి జిల్లావ్యాప్తంగా ఒక బీభత్సమైన వాతావరణం సృష్టించి కార్యక్రమాన్ని ముగించడం హేయమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ టిడిపి మద్దతు దారులు, కార్యకర్తలు, నాయకులు తప్ప సామాన్య మధ్యతరగతి ప్రజలెవరూ హాజరు కాలేదన్నారు. సిపిఐఎంఎల్ నాయకులు లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ప్రజా సంఘాలను, పర్యావరణ పరిరక్షకులను, రైతులను, ప్రజలు ఎవరినీ హాజరు కాన్వికుండా నిర్బంధాలు సృష్టించి ప్రజాహక్కులను కూటమి ప్రభుత్వం కాలరాసిందన్నారు. ప్రజాస్వామ్య దేశం అని ఓ వైపు ప్రకటించుకుంటూ మరో వైపు ప్రజాహక్కులపై ఈ ప్రభుత్వాలు ఉక్కుపాదాలు మోపుతున్నాయన్నారు. వీటిని ప్రజలు చైతన్యవంతులై ఇథనాల పరిశ్రమ స్థాపనను అడ్డుకొని తీరుతారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన బాధ్యతలను గుర్తించి సరైన పద్ధతుల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలన్నారు. పోలీసులు ప్రజలకోసం, ప్రజల సంరక్షణ కోసం పని చేస్తున్నారా.. లేక ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నారా.. అని ఎస్‌యుసిఐ(సి) నాయకులు బసవరాజు ప్రశ్నించారు. పోలీసులు నేరుగా వెళ్లి ప్రభుత్వానికి అనుకూలంగా ఇథనాల్ పరిశ్రమ స్థాపించేందుకు మద్దతు ప్రకటించాలని కరపత్రాలు పంపిణీ చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. ప్రజాసంఘాలు, పర్యావరణ పరిక్షణ ప్రేమికులు, ప్రజలు తమకు ఈ పరిశ్రమలు వద్దని ప్రతిఘటిస్తుంటే ఇటువంటి చర్యలకు ప్రభుత్వం పాల్పడటం దారుణమన్నారు. ఒకేరోజు మూడు పరిశ్రమల స్థాపనకు ప్రజాభిప్రాయ సేకరణ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, మూలి వెంగయ్య, ఎపిసిఎల్స్ నాయకులు బ్రహ్మం, కొడవలూరు సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌డి మహబూబ్‌బాషా, సిపిఎం నాయకులు టి.దయాకర్, న్యూ డెమొక్రసీ నాయకులు కె.రాంబాబు, సిపిఐ సీనియర్ నాయకులు రామరాజు, సిరాజ్ , ఒపిడిఆర్ నాయకులు శివశంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజయ్, సుధీర్, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక కన్వీనర్ జాషువా, తదితరులు పాల్గొన్నారు.

బిపిసిఎల్ రిఫైనరీలో ఆయిల్ ఇండియా కంపెనీ

ప్రజాశక్తి-కందుకూరు

రామాయపట్నం ఓడరేవు వద్ద భారత్ పెట్రోలియం కంపెనీ ఏర్పాటు చేయనున్న చమురు శుద్ధి కర్మాగారంలో ఆయిల్ ఇండియా కంపెనీ, ఆరాం కో భాగస్వామ్యం పొందనున్నాయి. ఆయిల్ ఇండియా కంపెనీ ఇప్పటికే ఈ మేరకు భారత్ పెట్రోలియం కంపెనీతో అవగాహన ఒప్పందం కుదురుచుకుంది. భారత్ పెట్రోలియం కంపెనీ లక్ష కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో రామాయపట్నం ఓడరేవు సమీపంలో చమురు శుద్ధి కర్మాగారం తో పాటు పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ని నిర్మించాలని భావించిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టులో 10 శాతం వాట పొందేందుకు ఆయిల్ ఇండియా కంపెనీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.అదే ప్రాజెక్టులో 20శాతం వాటా పొందేందుకు సౌదీ అరేబియాకు చెందిన ఆరాంకో కంపెనీ ముందుకొచ్చింది. ప్రాజెక్టు వివరణాత్మక నివేదిక పూర్తయ్యాక రెండు కంపెనీల మధ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. అయితే ఈ ప్రాజెక్టుకు అవసరమైన 25శాతం ముడిచముడును తమనుంచే కొనుగోలు చేయాలని ఆరాం కో కంపెనీ భారత్ పెట్రోలియం కంపెనీకి షరతులు పెడుతుంది. ఆరాంకో కంపెనీ సౌదీ అరేబియా ప్రభుత్వాని చెందంది. ఆరాం కో కంపెనీ చమురు ఉత్పత్తి దారు కూడా. ఇండియన్ ఆయిల్ కంపెనీ భారత ప్రభుత్వ రంగ సంస్థ. ఆసక్తిగల బ్యాంకులకు 5శాతం వాటా ఇవ్వాలని బారత పెట్రోలియం కంపెనీ భావిస్తుందని తెలిసింది. ప్రాజెక్టు స్థాపనకు ఓవైపు వివరునాత్మక సాధ్యా సాధ్యాల నివేదికలను భారత్ పెట్రోలియం కంపెనీ తయారు చేస్తుండగా మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం చమురుశుద్ధి కర్మగారానికి అవసరమైన భూసేకరణకు ముమ్మరంగా చర్యలు చేపడుతుంది. ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం 5 ఎకరాలకు పైగా కేటాయించింది. ఇప్పటికే గుడ్లూరు మండలంలోని చేవూరు రావూరు గ్రామాలలో భూసేకరణను దాదాపుగా పూర్తిచేసింది. గతంలో ఇండోసోల్ సోలార్ కంపెనీకి చేవూరు ,రావూరులో కేటాయించిన భూములనే రాష్ట్ర ప్రభుత్వం భారత్ పెట్రోలియం కంపెనీకి మార్చింది. ఇందుకు బదులుగా ఉలవపాడు మండలంలోని కరేడులో ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించిన విషయం తెలిసిందే .మరోవైపు కావలి మండలంలోని చెన్నాయపాలెం ,రుద్రకోట గ్రామాలలో చమురు శుద్ధి కర్మాగారానికి భూముల కేటాయింపు కోసం అధికారులు రైతులతో ముమ్మరంగా చర్చలు జరుపుతున్నారు. చెన్నాయపాలెం భూములకు ఎకరానికి రూ.24 లక్షల రూపాయల వంతున పరిహారం అందించేందుకు అంగీకరించిన అధికారులు, రుద్రకోట రైతులకు రూ.20 లక్షల పరిహారం మాత్రమే ఇస్తామని ప్రతిపాదించారు. దానిపై రుద్రకోట గ్రామరైతులు తీవ్రఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. చెన్నాయ పాలెం గ్రామ రైతుల్లోనూ పరిహారంపై ఆగ్రహావేశాలు లేకపోలేదు.

పలుచోట్ల గృహనిర్బంధాలు.. నోటీసులు..

దగదర్తి మండలం రాచర్లపాడు ఇఫ్కో కిసాన్‌సెజ్‌లో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణకు సిపిఎం, ప్రజాసంఘాలు, వామపక్షాల నాయకులను అడ్డుకొని పోలీసులు మంగళవారం గృహనిర్బంధం చేశారు. విష వాయువులను విడుదల చేసే ఇథనాల్ ఫ్యాక్టరీని గుజరాత్, తెలంగాణా, రాజస్థాన్‌లో అడ్డుకోవడంతో నెల్లూరు జిల్లా దగదర్తి మండలం రాచర్లపాడు ఇఫ్కో కిసాన్‌సెజ్‌లో పెట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలే చైతన్యవంతులై అడ్డుకుంటారని నాయకులు పేర్కొన్నారు. గృహనిర్బంధంపై పోలీసుల తీరును కావలి సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, జలదంకి మండల సిపిఎం నాయకులు రావి మాల్యాద్రి, ఎం.ఆంథోనీ బాబు, డివైఎఫ్ఐలు తీవ్రంగా ఖండించారు. బుచ్చిరెడ్డిపాళెంలో ముత్యాల గురునాథం, చల్లకొలుసు మల్లికార్జున, పుత్తేటి మల్లికార్జు తదితరులు అరెస్టయ్యారు. కోవూరులో గండవరపు బుజ్జయ్య, ఎస్‌కెబాబు, గండవరపు శేషయ్య, పెద్దబ్బయ్య, దగదర్తిలో గోపసాని రమేష్, సుబ్బారెడ్డి, ఊచగుంటపాలెం గ్రామం చెందిన మాజీ సర్పంచి సీనయ్య మరో ఐదుగురిని ముందస్తుగా అరెస్టు కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయగిరిలో కాకు వెంకటయ్య, జలదంకిలో తాళ్లూరు మాల్యాద్రి, నెల్లూరు రూరల్‌లో ఆలూరు తిరుపాలు, పూడిపర్తి జనార్ధన్, మర్రిపాడులో ఎస్‌డి రహంతుల్లా, బత్తల రత్నయ్య హౌస్ అరెస్ట్ చేశారు. మిగతా నాయకులకు నోటీసులు అందజేశారు.

సిఐటియు మహాసభల జయప్రదానికి ర్యాలీ

ప్రజాశక్తి-కావలి

సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు నేటి నుంచి నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్నాయని ఈ మహాసభలు జయప్రదం కావాలని కోరుతూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో కావలి పట్టణంలో ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సెంటర్ నుండి కార్మికులు సిఐటియు కార్యకర్తలు ప్రదర్శనగా బయల్దేరి కోర్టు సెంటర్, కూరగాయల మార్కెట్ బిపిఎస్ సెంటర్ల మీదగా శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్దకు ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ ఉపాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కేంద్రంలో పరిపాలిస్తున్న బిజెపి ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక పరిపాలన సాగిస్తుందని పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోళ్లను తీసుకొచ్చిందని వీటి వల్ల కార్మికులకు, ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఉన్న చట్టాలను రద్దు చేయడం ప్రయివేటు యాజమాన్యం, పారిశ్రామిక వేత్తలకు లాభాల కోసమేనని కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తుందని తెలిపారు. ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు ప్రభుత్వాలు స్వస్తి పలకాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై కార్మిక చట్టాల రద్దుపై ఈ మహాసభలలో చర్చ జరుగుతుందని ఈ విధానాల మీద రాబోవు రోజులలో పోరాడేందుకు ఈ మహాసభలు పిలుపునిస్తాయని కార్మికులు, ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేంత వరకు రద్దు చేసిన చట్టాలను సాధించుకునేందుకు పోరాడాలని విశాఖపట్నంలో జరుగుతున్న అఖిల భారత సిఐటియు మహాసభలకు కార్మికులు ఉద్యోగులు ప్రజలు తమ సహాయ సహకారాలను అందించి నాలుగవ తేదీ జరిగే మహ కార్మిక ప్రదర్శనలో అన్నిరంగాల ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై.కృష్ణమోహన్, జి.మధుసూదనరావు, ప్రజాసంఘాల నాయకులు ఎస్.మధు, సిహెచ్ పోలయ్య, కార్మిక నాయకులు జె.బాబు, ఎం.బాలయ్య, ఓ రమేషు, టి.సీనయ్య, ఎం.భాస్కర్ మహిళా నాయకులు పి.చిన్నమ్మ, ఎల్ రాజ్యలక్ష్మి, ఏ ఆదిలక్ష్మి, బి పద్మ, పి అనిత, రాజేశ్వరితో పాటు కార్మికులు ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రదర్శన చేపడుతున్న సిఐటయు నాయకులు

జెవివి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కావలి

నూతన ఆంగ్ల సంవత్సరం ఆగమనం – కొత్త ఆంగ్ల సంవత్సర వీడ్కోలు సందర్భంగా కావలి పట్టణ పుచ్చలపల్లి వారి వీధిలోని 'నేమ్స్' స్కూల్‌లో పట్టణ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నేమ్స్ హై స్కూల్‌లో విద్యార్థులకు " సేఫ్ – అన్సేఫ్ టచ్ " పర్యావరణ హితం – మూఢనమ్మకాలు " అంశంపై జెవివి నాయకులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెవివి గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ .రవికుమార్, సహాయ కార్యదర్శి, సి.శారద, జిల్లా ఉపాధ్యక్షులు పి.జానకిరామ్, ఉపాధ్యక్షుడు, కె.నారాయణ, ప్రధాన కార్యదర్శి జి .హరనాథ్, ఉపాధ్యక్షుడు, ఎస్.వెంకయ్య, జి.రాజశేఖర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ బి.రవికుమార్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి ప్రజలంతా శాస్త్రీయదృకృథంతో ముందుకు రావాలని, దయ్యాలు, మూఢవిశ్వాసాలు ప్రగతికి అడ్డుపడతాయని, అంటువ్యాధులకు మూఢవిశ్వాసాల కారణంగా అడ్డంకి ఏర్పడుతున్నదని విద్యార్థి దశలోనే మూఢవిశ్వాసాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమావేశం అయ్యాక విద్యార్థులు తమ సంశయాలను అడిగి తెలుసుకున్నారు. చర్చలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులకు " పాడుకుందాం.. పరిణామక్రమం " అనే జనవిజ్ఞాన వేదిక ప్రచురణ పుస్తకాలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారికి పుస్తకం అందజేస్తున్న జెవివి నాయకులు

అక్రమ అరెస్టులపై ఖండన

ప్రజాశక్తి-నెల్లూరు : రాచర్లపాడు ప్రాంతంలోని ఇఫ్కోసెజ్‌లో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి హాజరైయ్యేందుకు తరలి వెళ్తున్న సిపిఎం నాయకులను పోలీసులు అక్రమ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో పలు ప్రాంతాలల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణకు పిలుపునిచ్చిన ప్రభుత్వం తమ అభిప్రాయాలు తెలిపేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా దుర్మార్గంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు వంటి అనేక మందిని గృహ నిర్బంధం చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, నాయకులు కే.పెంచల నరసయ్య, కట్టా సతీష్, పెంచలయ్య ,ప్రసాద్ నరసింహారెడ్డి. ఎండి అజీజ్. సంపత్. కోటేశ్వరరావు. కె.వి శివాజీ. ఎం సుధాకర్. ఎన్ మాలకొండయ్య. లవన్ కుమార్. పెంచలయ్య. కృష్ణమూర్తి. సాంసంన తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : ఇథనాల్ పరిశ్రమ వద్దు అంటూ ప్రజలను చైతన్యం చేస్తూ దాన్ని వ్యతిరేకిస్తున్న సిపిఎం నేతలు జిల్లా కార్యదర్శి మూలం రమేష్‌తో పాటు మరికొంతమంది సిపిఎం వామపక్ష పార్టీల నాయకులను గృహ నిర్బంధం, ముందస్తు అరెస్టులు నోటీసులు ఇవ్వడాన్ని సిపిఎం కావలి పట్టణ కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని పసుపులేటి పెంచలయ్య ఖండించారు.

అక్రమ అరెస్టులపై సిపిఐ ఖండన

విషవాయువును చిమ్మే ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న వామపక్ష నాయకులను ముందస్తు గృహనిర్బంధం అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ నాయకులు దమ్ము దర్గాబాబు, మండ్ల వెంకటేశ్వర్లు, చేవూరు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

'బీద'కు ఎంఎల్ఎ కృష్ణారెడ్డి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కావలి



టిడిపి నెల్లూరు పార్లమెంట్ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన బీద రవిచంద్రకు కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో రవిచంద్రను ఎం.ఎల్.ఎ. మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. జిల్లా అధ్యక్ష పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రవిచంద్రకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ బాధ్యతను విజయవంతంగా నిర్వహించాలని ఎంఎల్ఎ ఆకాంక్షించారు. జిల్లా అధ్యక్ష పదవి లభించడంపై ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఇద్దరూ సుదీర్ఘంగా రెండు గంటలసేపు పలు అంశాలపై చర్చించుకున్నారు.

కోర్టు నోటీసు
ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : నెల్లూరు
D.R.P. No. 42/2025
O.S.No. 471/2014

1. పాపరెడ్డి రాజేష్ రెడ్డి
మరియు ఒకరు – పిటిషనర్లు / వాదులు

Vs

1. మాచిరెడ్డి భక్తవత్సలరెడ్డి, తండ్రి లేట్ **జయరామిరెడ్డి,**
2. మాచిరెడ్డి సరిత @ సమత @ షరీషా, తండ్రి **భక్తవత్సలరెడ్డి,** 1, 2 వారల నివాసం డోర్ నెం. 20/1/462, లాలాతోట, మూలాపేట, నెల్లూరు నగరం.
– రెస్పాండెంట్లు / ప్రతివాదులు

పై నెంబరు పిటిషన్‌లోని వాదులు వారికి చెందిన డాక్యుమెంట్లు కోర్టులో ఉన్నందున వాటిని ఇప్పించమని కోరగా సదరు పిటిషనులో పై చెప్పిన రెస్పాండెంట్లు ముగ్గురికీ మీకేమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపు కొనవలసినదిగా మీ నోటీసు కొరకు **తే28-01-2026ది** కి వాయిదా వేసియున్నారు. కావున మీకేమైనా అభ్యంతరం ఉంటే ఆదినము **ఉదయం 10.30 గంటలకు** కోర్టుకు హాజరై తెలుపుకొనవలసినది. మీరు రానియెడల మీ పరోక్షములో తీర్మానించబడును.

నెల్లూరు
తేది: 30-12-2025
ఆర్.సత్యనారాయణ
అడ్వకేట్
సెల్: **98661 89907**

న్యూ ఇయర్ వేడుకలపై హెచ్చరికలు

ప్రజాశక్తి - ఉదయగిరి

డిసెంబర్ 31వ తేదీ, నూతన సంవత్సర 2026 వేడుకల సందర్భంగా సర్కిల్‌లోని ఉదయగిరి, దుత్తలూరు, సీతారామపురం, వరికుంటపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు ప్రజా భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సిఐ వెంకట్రావు, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ముఖ్య కూడళ్లు, సున్నిత ప్రాంతాలలో పోలీస్ పికెట్లు ఏర్పాటు పట్టణవ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కఠినంగా నిర్వహించబడతాయన్నారు. ముఖ్యంగా పోలీస్ అనుమతి లేకుండా న్యూ ఇయర్ వేడుకలు, పార్టీలు నిర్వహించరాదని డీజే కార్యక్రమాలుకు అనుమతి లేదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ట్రిపుల్ రైడింగ్ కఠిన శిక్ష అర్హులు అవతారన్నారు. ప్రజలు ఉన్నచోట మద్యం సేవించడం అనుమతించబడదని తెలిపారు. హొటళ్లు, ధాబాలు, లాడ్జీలు, ఫంక్షన్ హాళ్లు అనుమతి లేకుండా వేడుకలు నిర్వహించరాదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా సూచించాలని రోడ్లమీద ఎక్కడపడితే అక్కడ కేకులు కట్ చేయడం, క్రాకర్స్ కాల్చడం వంటి కార్యక్రమాలు చేయరాదన్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులపై అమానుషంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. గంజాయి సేవనం, లేదా సరపరా, మారక ద్రవ్యాల అక్రమ రవాణ నిషేధం కనుక పోలీస్ వారికి వెంటనే తెలపాలని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పోలీస్ వారికి సహకరించి నూతన సంవత్సరాన్ని శాంతియుతంగా, సురక్షితంగా జరుపుకుందామని రోడ్డుల మీదకి రాకండి– కుటుంబంతో కలిసి సంతోషంగా జరుపుకోవాలన్నారు.

ఉదయగిరిలో.. సిఐ, ఎస్ఐలు



ఆత్మకూరులో.. సిఐ, ఎస్ఐలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పోలీస్ సర్కిల్ పరిధిలో ప్రజలు న్యూ ఇయర్ వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు సిఐ జి.గంగాధర్ హెచ్చరించారు. జిల్లా ఎస్పి అజిత వేజెండ్ల, ఆత్మకూరు డిఎస్‌పి వేణుగోపాల్ సూచనల మేరకు మంగళవారం ఆత్మకూరు ఎస్ఐ జిలానితో కలిసి తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. న్యూ ఇయర్ వేడుకల నిబంధనలపై ఆయన మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకలలో ఊరేగింపులు, రోడ్లపై అడ్డంగా కేకులు కట్ చేయడం నిషేధమని, పెద్ద ఎత్తున డీజేలు బాణా సంచాలు కాల్చినా, మందు పార్టీలు నిర్వహించిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనాలు సైలెన్సర్లు తొలగించి అధిక శబ్దాలతో తిరిగితే అటువంటి వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జూదాలను నిర్వహించినా అర్ధరాత్రి దాటి ఆకతాయిలు అల్లరి చిల్లరగా తిరిగిన, స్కూటర్లపై కేకలు వేస్తూ వీధుల్లో తిరిగినా వారిపై చర్యలు చేపడతామన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కార్యక్రమాలకు, వేడుకలకు, ప్రార్థన మందిరాలకు వెళ్లేటప్పుడు ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ ఏడాది తమ సర్కిల్ పరిధిలోని అన్ని స్టేషన్ల ఎస్ఐలు వారి సిబ్బంది సహకారంతో ఆత్మకూరు సర్కిల్ మొదటి స్థానంలో నిలిచిందనందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, తెనాలి టౌన్, బాలాజీ రావు పెట్, 5 లైన్, డోర్.నెం.8-17-67 కాపురస్థులైన గొట్టుముక్కల వెంకట రమణ సూచనలమేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తి నెల్లూరు జిల్లా వింజమూరు కాపురస్థురాలు కొంపల్లి భాగ్య లక్ష్మి వైఫ్ అఫ్ కొంపల్లి వెంకటేశ్వర్లు గార్ల మరియు ఇతరలుకు చెందిన ఆస్తిని విక్రఇంచుటకు బహిరంగ పరచగా నా క్లయింటు కొనుగోలు చేయుటకు సిద్ధపడి ఉన్నారు, కావున దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరాలు, తనకఖాలు, తాకట్లు, కోర్ట్ జప్తులు ఇతర క్లైములు వగైరాలు ఉన్నయడల ఈ ప్రకటన తేదీ నుండి వారం రోజులు లోగా నాకు గాని, నా క్లయింటుకు గాని వ్రాత పూర్వకమైన ఆధారాలతో తెలియజేయగలరు. గడువులోగా యట్టి క్లయిములు రానియడల నిష్పేచి ఆస్తిగా భావించి నా క్లయింటు సదరు కొంపల్లి భాగ్య లక్ష్మి వగైరాల వద్ద నుండి సక్రమైన విక్రయ దస్తావేజులు పొందగలమని తదుపరి వచ్చు ఏట్టి క్లైములు షెడ్యూల్ ఆస్తినిగాని, నాక్లయింటు హక్కులను గాని బెండు చేయజాలవు.

షెడ్యూల్: గుంటూరు జిల్లా, తాడికొండ సబ్.డి & మండలం, నిడముక్కల గ్రామం, సెర్వే నెం: 92-C లో య.0-50 సెంట్లు మరియు సెర్వే నెం: 92-Dలోయ.0.50 సెంట్లు వెరశి రెండు నెంబరులు తాలూకు య. 1-00 సెంట్లు.

కె.శేఖర్,
అడ్వకేట్, గుంటూరు,
సెల్ : 9966220202

కోర్టు నోటీసు
ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : నెల్లూరు
D.R.P. No. 41/2025
O.S.No. 465/2014

1. మాచిరెడ్డి నాగిరెడ్డి
మరియు ఒకరు – పిటిషనర్లు / వాదులు

Vs

1. మాచిరెడ్డి నవనీతమ్మ, భర్త లేట్ **జయరామిరెడ్డి,**
2. మాచిరెడ్డి భక్తవత్సలరెడ్డి, తండ్రి లేట్ **జయరామిరెడ్డి,**
1,2 వారల నివాసం డోర్ నెం. 20/1/462, లాలాతోట, మూలాపేట, నెల్లూరు నగరం.
3. ఆళ్ళ నిర్మలమ్మ, భర్త **రమణారెడ్డి,**
డోర్ నెం. 27/1/149, బాలాజీనగర్, నెల్లూరు.
– రెస్పాండెంట్లు / ప్రతివాదులు

పై నెంబరు పిటిషన్‌లోని వాదులు వారికి చెందిన డాక్యుమెంట్లు కోర్టులో ఉన్నందున వాటిని ఇప్పించమని కోరగా సదరు పిటిషనులో పై చెప్పిన రెస్పాండెంట్లు ముగ్గురికీ మీకేమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపు కొనవలసినదిగా మీ నోటీసు కొరకు **తే28-01-2026ది** కి వాయిదా వేసియున్నారు. కావున మీకేమైనా అభ్యంతరం ఉంటే ఆదినము **ఉదయం 10.30 గంటలకు** కోర్టుకు హాజరై తెలుపుకొనవలసినది. మీరు రానియెడల మీ పరోక్షములో తీర్మానించబడును.

నెల్లూరు
తేది: 30-12-2025
ఆర్.సత్యనారాయణ
అడ్వకేట్
సెల్: **98661 89907**